# లోకం తీరు

-ఎన్.పద్మామస్తాన్




కాలింగ్ బెల్ మోగడంతో మధ్యాహ్నం నిద్రలో ఉన్న నేను ఈ టైంలో ఎవరొచ్చారబ్బా అనుకుంటూ లేచి వెళ్ళి తలుపుతీశాను. ఎదురుగా దుర్గమ్మ వదిన.

"మీరు మా ఇంటికి రాకపోయినా మేము మీ ఇంటికి వస్తుంటాం లెండి" అంటూ లోనికి వచ్చారు నిందాపూర్వకంగా.

"వదినగారూ మీ ఇంటికి మా ఇల్లెంత దూరమో, మా ఇంటికి మీ ఇల్లూ అంతే దూరం" అన్నాను నేనూ.

"సరే మీతో వాగ్యుద్ధానికి కాదు నేను వచ్చింది. ఈనెల ఇరవయ్యో తారీఖున మా అబ్బాయి పెళ్ళి. స్వయంగా శుభలేఖ ఇచ్చి పెళ్ళికి మిమ్మల్ని పిలవడానికి వచ్చాను" అంది బ్యాగ్‌లోంచి శుభలేఖ తీసి నాచేతిలో పెట్టి బొట్టుపెడుతూ.

"కూర్చోండి వదినగారూ మంచి వేడిలో వచ్చినట్టున్నారు చల్లగా తాగడానికి నిమ్మ షర్బత్ ఇస్తాను" అన్నాను.

"ఈ మర్యాదలేమీ అక్కరలేదులెండి. ఇప్పుడే దారిలో కూల్‌డ్రింక్ తాగి వస్తున్నాను. ఏదీ స్వప్న ఎక్కడా కనిపించడం లేదు నిద్రపోతోందా?" అన్నారు ఆరాగా.

ఆవిడ అడుగుతున్నది మా చిన్నమ్మాయి స్వప్న గురించి.

"లేదొదినా! డిఎస్సీ నోటిఫికేషన్ పడింది కదా. దానికోసం చదువుకుంటోంది" అన్నాను.

ఈలోగా స్వప్న రానేవచ్చింది "నమస్తే అత్తయ్యా!" అంటూ.

దుర్గమ్మ స్వప్న వంక ఎగాదిగా చూస్తూ "ఏమే స్వప్నా నల్లబడ్డట్టున్నావు. ఉద్యోగం కోసం కోచింగ్ సెంటర్ల చుట్టూ ఎండలో తిరుగుతున్నట్టున్నావు. మీ అమ్మ నీ పెళ్ళెప్పుడు చేస్తుందిట" అంది ఎత్తిపొడుపుగా.

"లేదత్తయ్యా నేను నల్లబడలేదు. మీరే అమెరికా వెళ్ళి వచ్చాక బాగా కలర్ వచ్చారు. మాధవి ఎలా ఉంది? పెళ్లికెప్పుడొస్తుంది?" అని అడిగింది.

"నీకన్నీ మీ అమ్మ తెలివితేటలు వచ్చాయ్. నేనెప్పుడూ రంగే. అమెరికా వెళ్ళాక తెల్లబడలేదు. పెళ్ళికి రావడానికి మాధవికి ఎక్కడ కుదురుతుంది. ఆమె ఉండేది ఏమన్నా అమలాపురంలోనా, అమెరికాలో కదా. అల్లుడిగారికి సెలవు దొరకాలి, రానుపోనూ ఖర్చు లక్షల్లో ఉంటుంది. అయినా మా మాధవిది ఎంత మంచి మనసో తెలుసా వదినా. ఆడపడుచు కట్నం కూడా వద్దంది. అబ్బాయికి మొత్తం,పది లక్షలు కట్నంగా ఇస్తున్నారు" అంది నా వంక చూస్తూ.

"అమ్మో పదిలక్షలే" అంది మా అమ్మాయి ఒక్కసారిగా.

"ఊరికే ఇస్తున్నారా స్వప్నా. మా అబ్బాయి బెంగుళూరులో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నెలకి నలభైవేలు సంపాదిస్తున్నాడు. ఆడపిల్లల్ని కన్నాక కట్నాలు ఇవ్వొద్దూ. ఊరకే అవుతాయా పెళ్ళిళ్ళు" అంటూ ఆమె వెళ్ళిపోయింది. ఆవిడని గేటు దాకా సాగనింపి లోపలికి వస్తూంటే మా పక్కవాటాలో అద్దెకి ఉంటున్న పిన్నిగారు

"ఎవరమ్మా వచ్చినావిడ?" అంది.

"పదేళ్లక్రితం మా ఇంట్లో మీదున్న వాటాలో అద్దెకుండేవాళ్ళులెండి" అని చెప్పి లోపలికి వచ్చాను.

లోపలికొచ్చేసరికి మురళి పెళ్ళి శుభలేఖ తదేకదీక్షతో చూస్తున్న స్వప్న కనిపించింది. ఆ దృశ్యాన్ని చూడగానే నా మనస్సు కలుక్కుమంది. పరిస్థితులు అనుకూలిస్తే స్వప్నకి మురళికి పెళ్ళి అయ్యేది.

పదేళ్లక్రితం దుర్గమ్మకి, ఇప్పటి దుర్గమ్మకి ఎంత మార్పు. మా ఇంట్లోకి అద్దెకొచ్చినప్పుడు చిన్నపిల్లలైన మా అమ్మాయిలతో అత్తయ్యా అని పిలిపించుకునేది. తనకొడుక్కి స్వప్నకి పెళ్ళి జరిగితే ఈ వాటా తమదే అవుతుందని అనేది. అది విని మేం నవ్వుకునేవాళ్లం. దుర్గమ్మ వాళ్లాయనకి రెవిన్యూ ఆఫీసులో చిన్న ఉద్యోగం. చాలీచాలని జీతం. ఇద్దరు పిల్లల చదువులతో ఇబ్బంది పడేవాళ్ళు. అమ్మాయి మాధవి అందంగా ఉండేది. డిగ్రీలో ఇంజనీరింగ్ స్టూడెంట్‌ని ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. పెళ్ళికి దుర్గమ్మ పూర్తి సహకారం ఉంది.

పెళ్ళి కొడుకు తరపువాళ్ళు మాత్రం వాళ్ళబ్బాయి వాళ్లకి తెలీకుండా పెళ్ళిచేసుకున్నందుకు నెత్తీనోరుబాదుకున్నారు. సాఫ్ట్‌వేర్ విప్లవంతో మాధవి వాళ్ళు అమెరికా వెళ్ళిపోయారు. దాంతో దుర్గమ్మ దశ తిరిగిపోయింది. కూతురు చలవ వల్ల సొంత ఇల్లు కట్టుకుని అందులోకి వెళ్ళిపోయారు. అబ్బాయికి డొనేషన్లు కట్టి ఇంజనీరింగ్ చదివించారు. మా పెద్దమ్మాయికి మా స్తోమతుని బట్టి అమలాపురంలోని ఓ బ్యాంకు ఉద్యోగికి ఇచ్చి పెళ్ళి చేశాం. ఇక స్వప్నకి పెళ్ళి కావాల్సి ఉంది. దుర్గమ్మ గురించి తెలియని పక్కింటి లాయర్‌గారి భార్య "స్వప్నని దుర్గమ్మ కోడలిగా చేసుకుంటానని అనేది. మీ అమ్మాయి అంటే మురళికి కూడా ఇష్టమే. నెమ్మదైన, అందమైన పిల్లంటే ఎవర్కి ఇష్టం ఉండదూ" అని అడిగింది.

"అలాంటి ఉద్దేశ్యం ఏమీ లేదు. మాకు తగ్గవాళ్ళకి మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తాం. ఆవిడ్ని అందుకోలేం" అన్నాను.

నాకు దుర్గమ్మకున్న వ్యవహారదక్షత లేదు. దుర్గమ్మ ఇంటి కోడలినవుతునాననే ఆలోచన స్వప్న మనసులో రాకుండా జాగ్రత్త పడేదాన్ని. నా ఆలోచనల్లో నేనుండగానే స్వప్న కోచింగ్ సెంటర్‌కి వెళ్లడానికి సిద్ధమై "అమ్మా! దుర్గమ్మత్తయ్య అవకాశవాది. తన కూతురికేమో కట్నం లేకుండా పెళ్ళి చేసి ఇప్పుడు కొడుక్కి లక్షలు కట్నంగా తీసుకుంది. ఇదెక్కడి న్యాయం" అంటూ వెళ్ళిపోయింది.

అమ్మాయి మాటలు ఆలకిస్తూ "ఈలోకం తీరు ఇంతేలే!" అని ఊరకుండిపోయాను.

★